# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | పేజీలు : 8 | శుక్రవారం | 09 జనవరి 2026 | వెల : 2/-







## రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ మంత్రి సమావేశం..
## తెలంగాణ సీఎంపై ప్రశంస..



- రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలను వివరించిన ముఖ్యమంత్రి
- జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణ విద్యా విధానం తీసుకు రానున్నట్లు వెల్లడి
- మల్లేపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ మంత్రికి రేవంత్ రెడ్డి సూచన

2



# బాగున్నారా అమ్మా..

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క
## – బీఆర్ఎస్ అధినేత ఆత్మీయ పలకరింపు

- మేడారం జాతరకు ఆహ్వానం పలికేందుకు ఎర్రవెల్లికి చేరుకున్న మంత్రులు
- "బాగున్నారా అమ్మా" అని పలకరించిన కేసీఆర్
- మంత్రులకు అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో కేసీఆర్ సత్కారం

తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 : రాష్ట్ర దేవదాయ ధర్మదాయ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. పంచాయతీ రాజ్ ఱ మహిళా మరియు శిశు సంక్షమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. మరికొద్ది రోజుల్లో, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా కోరుతూ కేసీఆర్ గారిని ప్రభుత్వం తరపున వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా, శాలువాకప్పి ఆహ్వాన పత్రికను అందజేసిన మంత్రులు కేసీఆర్ గారికి మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా... తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ శోభమ్మ దంపతులు, వారిని పసుపు కుంకుమ వస్త్రాలు, తాంబులాల తో సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి....

మిగతా పేజీ 2 లో..

## రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను – కేటీఆర్

- రాహుల్ గాంధీ పప్పు కాదు, ముద్దపప్పు అని రేవంత్ రెడ్డి అన్నారన్న కేటీఆర్
- ఇప్పుడు నేనూ ముద్దపప్పు అన్నానని చెప్పిన కేటీఆర్
- రేవంత్ రెడ్డిని విమర్శించిన తర్వాత తనను అనాలన్న కేటీఆర్



తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమని సంబోధించారో, తాను అదే వ్యాఖ్య చేశానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 'పప్పు' కాదని, 'ముద్దపప్పు' అని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు తాను కూడా అదే పదం ఉపయోగించానని ఆయన స్పష్టం చేశారు. 'రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అసభ్యకర పదాలు మాట్లాడితే కోపం వచ్చి, నేను కూడా రాహుల్ గాంధీని ఒక మాట అన్నాను. నా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు. కానీ, నేను కొత్తగా ఏమీ అనలేదు. రేవంత్ రెడ్డి అన్న మాటనే నేను అన్నాను. మీ రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని 'పప్పు' కాదు 'ముద్దపప్పు' అని అన్నారు. కాబట్టి ఆ విమర్శలు ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డిపై చేయండి. మీ సోనియా గాంధీని మీ రేవంత్ రెడ్డి 'బలిదేవత' అన్నారు. అలాంటి వ్యక్తిని తీసుకువచ్చి మీరు ముఖ్యమంత్రిగా చేశారు. తనను ముఖ్యమంత్రిగా చేసిన రాహుల్ గాంధీని 'ముద్దపప్పు' అని అన్నది రేవంత్ రెడ్డే" అని ...

2

## దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చెయ్
## - కేటీఆర్ కు పొంగులేటి సవాల్

- నిన్న ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్
- ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న వల్లే కాలేదని ఎద్దేవా
- మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యాఖ్య




తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చేయాలని సవాల్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చి గొప్పలు చెప్పడం మానుకోవాలని చెప్పారు. కేటీఆర్ నిన్న ఖమ్మం జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనపై పొంగులేటి స్పందిస్తూ కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న తరం కాలేదు... నీ వల్ల ఏమవుతుందని అని అన్నారు. ముందు మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని

2

## మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

- బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని ఆరోపణ
- కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో 240 సీట్ల వద్ద ఆగిపోయిందని వెల్లడి
- మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తానంటే అంగీకరించేది లేదన్న ముఖ్యమంత్రి



తొలి వెలుగు, డెస్క్, జనవరి 08: 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు గెలుచుకుని ఉంటే రాజ్యాంగాన్నే మార్చివేసేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెజారిటీ ఉ ందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో ...

2

## అశోక్ నగర్‌లో నిరుద్యోగుల అరెస్టు
## - కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు



తొలి వెలుగు, డెస్క్, జనవరి 08: రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలంటూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం దారుణమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ హామీలు గుప్పించిందని విమర్శించారు. ప్రస్తుతం జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు 20 వేలకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, దానికి అనుగుణంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. కాగా, అశోక్ నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను, నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రంథలయం నుంచి అశోక్ నగర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఖాళీ అవుతున్న హైదరాబాద్
### కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 : తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ లో నివసిస్తున్న కుటుంబాలు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమవుతున్నాయి. ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. సికింద్రాబాద్ స్టేషన్ అయితే పూర్తిగా రద్దీతో నిండిపోయింది. లగేజీలు, పిల్లలు, పెద్దలతో జనసంద్రం కనిపించింది. ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన దక్షణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను అనౌన్స్ చేసింది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ఏపీ ప్రాంతాలకు డిమాండ్ ఆకాశాన్నంటడంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గించేందుకు... జనవరి 7 నుంచి 20 వరకు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. దీనివల్ల ఐటీ కారిడార్‌లో ఉండే ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే సౌకర్యం లభిస్తుంది, ఇది చాలా మందికి భారీ రిలీఫ్‌గా మారింది.

## 'అన్వేష'తో 2026కి శ్రీకారం
### - మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఇస్రో

- 2026 తొలి ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో
- ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా EOS-N1 ఉపగ్రహ ప్రయోగం వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ కోసం 'అన్వేష' ఉపగ్రహం
- ప్రధాన ఉపగ్రహంతో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలు కూడా
- స్పెయిన్ స్టార్టప్ అభివృద్ధి చేసిన రీ-ఎంట్రీ టెక్నాలజీ ప్రదర్శన



తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఋూూ-చీ1)తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహమైన ఋూూ-చీ1కు 'అన్వేష' అని కూడా పేరు పెట్టారు. వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పర్యవేక్షణ వంటి కీలక రంగాలలో దేశ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. "రాకెట్, ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. ప్రయోగానికి ముందు జరగాల్సిన తనిఖీలు కొనసాగుతున్నాయి" అని ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోగంలో స్పెయిన్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన 'కెస్ట్రెల్ ఇనీషియల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ల (ఖ×ఐ) అనే ఒక చిన్న రీ-ఎంట్రీ వాహనాన్ని కూడా పరీక్షిస్తున్నారు. అన్ని ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత ఇది భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోనుంది. పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్ఎల్వీ-డీఎల్ వేరియంట్‌తో ఇది ఐదో ప్రయోగం. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య-ఎల్1 వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రయోగాలను పీఎస్ఎల్వీ విజయవంతంగా పూర్తి చేసింది. కాగా, గత ఏడాది మే నెలలో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైన విషయం తెలిసిందే.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క

## – బీఆర్ఎస్ అధినేత ఆత్మీయ పలకరింపు

మొదటిపేజీ తరువాయి.. విందు స్వీకరించిన మహిళా మంత్రులు, కాసేపు పరస్పర యోగక్షమాలు, ఇష్టాగోష్టి అనంతరం మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా.. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, సాదర ఆహ్వానం పలికారు.

# రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను

## – కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
కేటీఆర్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ 'దద్దమ్మ' కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం కూడా భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి క్రాప్ హాలిడేలు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కోసం కుస్తీలు లేవని, విత్తనాల కోసం పోటీ లేదని, కరెంటు కష్టాలు లేవని, క్రాప్ హాలిడేలు లేవని ఆయన వెల్లడించారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూ–రు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తన బాస్‌కు కోపం వస్తుందనే భయంతో రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన అన్నారు.

# రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ మంత్రి సమావేశం..

## తెలంగాణ సీఎంపై ప్రశంస..

మొదటిపేజీ తరువాయి...
తొలి వెలుగు, డెస్క్, జనవరి 08:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్ నేతృత్వంలోని బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు.

25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకేచోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ. 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. జాతీయ విద్యా విధానం తరహాలో త్వరలో తెలంగాణ విద్యా విధానం తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మల్లేపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ ప్రదేశ్ మంత్రికి ముఖ్యమంత్రి సూచించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణంపై హిమాచల్ మంత్రి రోహిత్ ఠాకూర్ ఆసక్తి కనబరిచారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణి, పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### విద్యా శాఖ ఉన్నతాధికారులకు రేవంత్ రెడ్డి సూచన

ప్రతి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆయన విద్యా శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లపై చర్చ జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించాలని ఆదేశించారు. సోలార్ కిచెన్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. బడ్జెట్ కేటాయింపుల్లో యంగ్ ఇండియా స్కూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

# దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చెయ్

## - కేటీఆర్ కు పొంగులేటి సవాల్

మొదటిపేజీ తరువాయి..
ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారని పొంగులేటి మండిపడ్డారు. ప్రభుత్వం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ పవర్ ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ మతి భ్రమించి రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై మాట్లాడుతున్నారని, సూర్యుడి పైకి ఉమ్మితే అది తిరిగి తన ముఖం మీదే పడుతుందని గమనించాలని అన్నారు. అవినీతి, దోపిడీలకు పేటెంట్‌గా ఉన్న కల్వకుంట్ల ఫ్యామిలీ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. జాతీయ నాయకుడిని విమర్శిస్తే తాను కూడా జాతీయ నాయకుడినవుతానని తాపత్రయ పడటంలో తప్పులేదు కానీ ఆశకు హద్దు ఉండాలని అన్నారు. ఎన్నికల్లో వరుసగా దెబ్బలు తిన్నా బుద్ధి తెచ్చుకోకుండా అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు రెఫరెండం అని చెప్పిన ఎన్నికల్లోనే ప్రజలు గూబ గుయ్యిమనిపించారు. జూబ్లీహిల్స్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ అంటున్నారు... దేనికి సెమీ ఫైనల్?" అంటూ ప్రశ్నించారు.

# మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి.. పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. మెజారిటీ ఉందన్న అహంకారంతో చట్టసభలను వినియోగించి పేదలను అణిచివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. అందుకే గత ఎన్నికల్లో 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని ఆయన అన్నారు. ఓట్లను తొలగించేందుకు



ఎస్ఐఆర్ తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రియుడు అనుమానించాడని..

## వాటర్ ట్యాంకు పైనుంచి దూకి యువతి ఆత్మహత్య

తొలి వెలుగు, డెస్క్, జనవరి 08:
హైదరాబాద్‌లోని నాగోల్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువకుడు అనుమానించాడనే మనస్తాపంతో ఓ యువతి వాటర్ ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందగా, ఘటనకు కారణమైన ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన ఐశ్వర్య (19) తన అన్నతో కలిసి నాగోలు సమీపంలోని తట్టిఅన్నారం వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తోంది. ఆమె దూరపు బంధువైన మహేష్ అలియాస్ ఆనంద్ (23) హస్తినాపురంలో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. ఏడాది క్రితం ఓ పూజలో పరిచయమైన వీరిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా, మొదట నిరాకరించిన పెద్దలు తర్వాత అంగీకరించారు. అయితే, ఐశ్వర్య తరచూ ఫోన్‌లో వేరొకరితో మాట్లాడుతోందని ఆనంద్ అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 5న ఇద్దరూ హౌసింగ్ బోర్డు కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద కలుసుకున్నారు. ఈ





సందర్భంగా ఫోన్ కాల్స్ విషయంపై ఆనంద్ ఆమెను నిలదీయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఐశ్వర్య, ట్యాంక్ పైనుంచి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలైన ఆమెను నాగోల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. తమ కుమార్తె మృతికి ఆనందే కారణమని ఐశ్వర్య కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# వీధి కుక్కలు భయాన్ని పసిగడతాయి

## - భయపడేవాళ్లపైనే ఎక్కువగా దాడి చేస్తాయి - సుప్రీంకోర్టు

తొలి వెలుగు, డెస్క్, జనవరి 08:
మనిషిలోని భయాన్ని కుక్కలు సులభంగా పసిగట్టగలవని, భయపడే వ్యక్తులపైనే అవి ఎక్కువగా దాడి చేస్తాయని సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల నిర్వహణపై సుమోటోగా స్వీకరించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పాఠశాలలు, ఆసుత్రులు, బస్టాండ్లు వంటి ప్రజా ప్రాంగణాల్లో పట్టుకున్న వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేశాక తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టవద్దని 2025 నవంబర్‌లో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సమయంలో, "మీరు భయపడుతున్నారని తెలిస్తే కుక్కలు దాడి చేసే అవకాశం ఎక్కువ. ఇది మా వ్యక్తిగత అనుభవం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది సీయూ సింగ్ వాదనలు వినిపిస్తూ, ఎలుకల జనాభాను నియంత్రించడంలో కుక్కలు పర్యావరణ సమతుల్యతకు సహాయపడతాయని తెలిపారు. కుక్కలను హఠాత్తుగా తొలగిస్తే ఎలుకల



బెడద పెరుగుతుందని, గతంలో సూరత్‌లో ఇలాగే జరిగిందని గుర్తుచేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కుక్కల తొలగింపునకు, ఎలుకల పెరుగుదలకు మధ్య నిర్దిష్ట సంబంధం ఉందా అని ప్రశ్నించింది. సరదాగా వ్యాఖ్యానిస్తూ, "ఎలుకలను పిల్లులు బాగా వేటాడతాయి. కాబట్టి కుక్కలను తగ్గించి, పిల్లులను పెంచితే సమస్య తీరొచ్చు కదా?" అని పేర్కొంది. పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ తరఫున న్యాయవాది శ్యామ్ దివాన్ వాదిస్తూ, యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం పట్టుకున్న కుక్కలను అదే ప్రాంతంలో తిరిగి వదిలిపెట్టాలని తెలిపారు. కుక్కలను షెల్టర్లలో ఎక్కువ కాలం బంధించడం క్రూరత్వం అవుతుందని అన్నారు. ఈ కేసులో కుక్కల ప్రేమికులు, జంతు హక్కుల కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, కుక్కకాటు బాధితులు సహా అన్ని వర్గాల వాదనలను సుప్రీంకోర్టు వింటోంది.

# ప్రధాని నరేంద్ర మోదీపై ఉద్ధవ్ థకరే కీలక వ్యాఖ్యలు

తొలి వెలుగు, డెస్క్, జనవరి 08 :
ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థకరే తీవ్ర విమర్శలు చేశారు. నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయాలనే ఉద్దేశంతో తాను రెండుసార్లు ఆయన కోసం ప్రచారం చేస్తే, ఆయన మాత్రం ఇప్పుడు తనకు రాజకీయంగా ముగింపు పలకాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీటీఐ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, మోదీని ప్రధానిగా చేయడానికి తాను 2014, 2019లలో ప్రచారం చేశానని గుర్తు చేశారు. అయితే, ఆయన తన పార్టీని విచ్ఛిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఆయన కోసం ప్రచారం చేసినందుకు తనకు బాధగా, కోపంగా ఉందని అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర నుంచి ముంబైని వేరు చేయాలన్న ఉద్దేశం బీజేపీకి ఎప్పటి నుంచో ఉందని ఆయన ఆరోపించారు. బాలాసాహెబ్ థకరే ప్రస్తుతం లేరని బీజేపీ భావిస్తోందని, అందుకే 'సేన'ను కాగితంపై వారు ముగించారని, కానీ






క్షేత్రస్థాయిలో మాత్రం అలా చేయలేరని అన్నారు. బాల్ థకరే ఉన్నప్పుడు 2012 వరకు వాళ్లు జాగ్రత్తగా ఉండేవారని బీజేపీని ఉద్దేశించి అన్నారు.

# ముగ్గుల పోటీలతో కనువిందు.. విశాల భారతిలో సంక్రాంతి సంబరాలు

- శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులు.. అలరించిన రంగవల్లులు
- విద్యార్థులకు సంస్కృతిపై అవగాహన కల్పించడమే లక్ష్యం
- కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి





చౌటుప్పల్, జనవరి 8, (తొలివెలుగు) : తెలుగువారి సంస్కృతికి ప్రతీక అయిన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చౌటుప్పల్ పట్టణంలోని విశాల భారతి హై స్కూల్‌లో గురువారం సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభతో కళకళలాడింది. వేడుకల్లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలు, విభిన్న రకాల రంగులతో అద్భుతమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. తమలోని సృజనాత్మకతను జోడించి వేసిన ఈ ముగ్గులు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. సంక్రాంతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ రంగవల్లులు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో అంతరించిపోతున్న మన ఆచారాలను, సంస్కృతిని భావితరాలకు (విద్యార్థులకు) పరిచయం చేయడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని అన్నారు. చదువుతో పాటు మన పండుగల విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడెల ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని సంక్రాంతి వేడుకలకు మరింత వైభవాన్ని చేకూర్చారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- చౌటుప్పల్ మండలంలోని గురుకులాల్లో ఉచిత వైద్య శిబిరాలు
- కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు
- మండల వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కాటమరాజు





చౌటుప్పల్, జనవరి 8 (తొలివెలుగు) : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడా నిరంతరం శ్రద్ధ వహించాలని చౌటుప్పల్ మండల వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కాటమరాజు సూచించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తూప్రాన్ పేట ఎంజేపీటీ బాలికల, బాలుర పాఠశాలలు, పట్టణ కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం, అంకిరెడ్డిగూడెం మైనార్టీ గురుకులం, నేలపట్ల ఎస్సీ బాలుర వసతిగృహాల్లో వైద్య బృందాలు పర్యటించాయి. విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్న వైద్యులు, వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ కాటమరాజు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివకుమార్, నరేష్, సౌజన్య, అనిత, మనోహర్, సిహెచ్ ఓలు ప్రణతి, పారిజాత, రజిత, జ్యోతి, పి.హెచ్.ఎన్ శశికళ, ఎంఎల్ హెచ్‌పీలు సత్యనారాయణ, పారిజాత, హెచ్ఈఓ శశికళ, ఝాన్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు చౌటుప్పల్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

## - చౌటుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్

చౌటుప్పల్, జనవరి 8 (తొలివెలుగు) : చౌటుప్పల్ సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న అత్యవసర మరమ్మత్తుల కారణంగా నేడు (శుక్రవారం) చౌటుప్పల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. 09.01.2026న ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విద్యుత్ నిలిపివేత వల్ల చౌటుప్పల్ టౌన్, చిన్న కొండూర్, జిబ్లాక్ పల్లి (అగ్రికల్చర్), అంకిరెడ్డిగూడెం, తాళ్లసింగరం, లింగోజిగూడెం ప్రాంతాలు ప్రభావితమవుతాయని అధికారులు తెలిపారు. అత్యవసర మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఈ సమయంలో వినియోగదారులు సహకరించాలని, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్ కోరారు.




# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

- సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రాక్టికల్, థియరీ
- విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు - బోర్డు అధికారి హెచ్చరిక
- 25 నుంచి థియరీ పరీక్షలు.. షెడ్యూల్ ఖరారు
- వసతులపై రాజీ పడొద్దు - బోర్డు జెయింట్ సెక్రెటరీ భీమ్ సింగ్





చౌటుప్పల్, జనవరి 8 (తొలివెలుగు) : రాబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి భీమ్ సింగ్ ఆదేశించారు. గురువారం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ ఒకేషనల్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాక్టికల్, థియరీ పరీక్షలన్నీ సీసీ కెమెరాల నిఘాలోనే జరుగుతాయని స్పష్టం చేశారు. ల్యాబ్ పరికరాలు, కనీస వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. హాల్‌టికెట్లలో తప్పులుంటే వెంటనే ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జనవరి 21, 22 తేదీల్లో ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఉంటాయని.. ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్, 25 నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# భీమారంలో ఇందిరమ్మ చీరల పంపిణీ..




తొలి వెలుగు, భీమారం మండలం, జనవరి 8 : భీమారంలో స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఆడపడుచులకు గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి సంజీవ్ చేతుల మీదుగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి మాట్లాడుతూ మహిళా ల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని,ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకెళ్తుందని,ఆర్టీసీ లో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులు చేసిందని,మహిళా సంక్షమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టిందని,ఆడ బిడ్డల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని,రాజకీయాలలో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించిందని అన్నారు.కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని,తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరుపున సారే పెట్టి గౌరవించాలని భావించిందని,అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వాతి - సంజీవ్, ఉపసర్పంచ్ పరమేశ్, వార్డు సభ్యులు పల్లికొండ సాయి, దాసరి నాగరాజు ,చెక్కపెల్లి విజయ్, యేలేటి సతీష్, పెద్దిరెడ్డి స్వామిరెడ్డి, చెక్కపెల్లి శంకర్ ,ద్యావనపెల్లి రాకేష్,తదితరులు పాల్గొన్నారు

## ఎంపిడిఓ కార్యాలయాన్ని పాత భవనంలోనే కొనసాగించాలి




**తొలి వెలుగు, ఇందల్ వాయి :** ఇందల్వాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని వేరే చోటకు తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల ప్రజలు ఎంపీడీవో అనంతరావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 23 గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ కార్యాలయాన్ని వేరే చోటకు మార్చే ఆలోచన తక్షణమే విరమించుకోవాలని వివిధ గ్రామాల సర్పంచ్ ఉప సర్పంచ్ లు మరియు ప్రజలు వ్యతిరేకించారు. అందరికీ అందుబాటులో ఉండాలంటే బస్టాండ్ ప్రాంగణం హెడ్ కోటర్ పరిధిలో ఉండాలని వారు కోరారు. ఎమ్మార్వో కార్యాలయం ఎక్కడైతే కొనసాగిస్తున్నారో ఎంపీడీవో కార్యాలయాన్ని కూడా అదే భవనంలోకి మార్చే ప్రక్రియ ఆలోచించాలి అంతే తప్ప వేరే చోట మార్చే ఆలోచన మానుకోవాలని కోరారు. పాత భవనంలోనే ఎంపీడీవో కార్యాలయం కొనసాగించాలనీ. వేరేచోట కు తరలిస్తే మండల ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంటుందని అందరికీ అందుబాటులో ఉండాలంటే పోలీస్ స్టేషన్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ఎక్కడ నిర్వహించిన ప్రజలకు వృద్ధులకు వికలాంగులకు అందుబాటులో సౌకర్యకరంగా ఉంటుందని మండల ప్రజాప్రతినిధులు వినతి పత్రం లో వారు కోరారు. ఇందల్వాయి ప్రజాప్రతినిధుల వివరణ ఇందల్వాయి మండలం ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఇందల్వాయి మండలానికి సంబంధించినవి ఇంధల్వాయి పేరు మీద ఉన్న ప్రతి కార్యాలయాన్ని కూడా ఇందల్వాయి శివారులో నిర్వహించాలి లేదా ఇంతకుముందు ఎక్కడైతే విధులను నిర్వహించారో అదే పాత భవనములో కొనసాగించాలి అని ఇందల్వాయి పాలకవర్గం సభ్యులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు తాజా మాజీలు కోరారు.

## నూతన పాలకవర్గానికి సన్మానం



**తొలి వెలుగు, బీర్పూర్ మండలం, జనవరి 8 :** పి ఎం శ్రీ ఎంపీపీ ఎస్ బీర్పూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులను నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, రాష్ట్రస్థాయి హరిత మిత్ర అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గానికి గ్రామ సర్పంచ్ ఎనుమట్ల హరీష్ , ఉపసర్పంచ్ ఎనుగంటి జితేందర్ లను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక విద్య బోధనకు నూతన టెక్నాలజీ విద్యార్థులకు బోధించడానికి జై ఫుల్ లెర్నింగ్ నాణ్యమైన విద్యను అందించడానికి 2 కంప్యూటర్లు మంజూరు చేయించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు కొరత ఉండడం వలన అదనపు తరగతి గదులు అవసరం ఉందని ,అదనపు తరగతి గదుల మంజూరు చేయించాలని కోరారు.అనంతరం గ్రామ సర్పంచ్ హరీష్ మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 2 కంప్యూటర్లు మరియు అదనపు తరగతి గదుల కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎనుమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనుగంటి జితేందర్ ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల శ్రీలత ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, భోగ నాగరాణి,బాణావత్ స్వరూప, షేక్ రజియా,కందుకూరి లలిత ,గంగిపల్లి మౌనిక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

## బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు..
### -మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో..




**తొలి వెలుగు, ఆర్మూర్, జనవరి 08:** నిజామాబాద్ జిల్లా పట్టణంలో జాతియ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల లో గురువారం రోజున ఆర్మూర్ విద్యార్థులకు, ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత,మైనర్ డ్రైవింగ్ పైన అవగాహన కల్పించటం జరిగింది, అలాగే ఇట్టి నియమాలను పిల్లలు వారి తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ టౌన్ సీఐ



సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ ఎంవిఐ రాహుల్, ట్రాఫిక్ ఎస్ఐ రఘుపతి, తో పాటు ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారుల చట్టబద్ధమైన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి





**తొలి వెలుగు, జవహర్ నగర్ :** అంబేద్కర్,జాగ్జీవన్ రామ్ ప్రాంగణంలో 2026, జనవరి-20 న తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారం కొరకు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే బారీ ప్రదర్శన,జయప్రదం చేయాలని జవహర్ నగర్ ప్రజలకు పిలుపునిస్తూ కరపత్రం,పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంగజ్జల రామ్ చందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా కళమండలి రాష్ట్ర అధ్యక్షులు జాన్,క్రాంతి కలమండలి వెంకరచారి,ప్రజా కళాకారుడు కొన్నే వేణు,గుండా యాదగిరి ప్రాంతీయ ఉద్యమ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు,గండి శ్రీను,భాస్కర్,తొండా వెంకట్,పల్లె ప్రవీణ్(డప్పు),ఏ ప్రవీణ్,పోతరాజు సోమన్న,ఎస్.డి.జిలానీ,పాషాలు పాల్గొని ప్రసంగించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్న కళాకారులు ఆట పాటలతో ఉగ్రూతలూగించారని,కాళ్లకు గజ్జలు కట్టి,గోసి గొంగడేసి ఈ నేలంతా తిరిగి,తెలంగాణను సాధించుకున్నారని గుర్తుచేశారు.ఎన్నికలకు ముందు తమ ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారానికి అధికార చట్టబద్దతో కూడిన ఉద్యమ కళాకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి,రెండు సంవత్సరాలు పూర్తయ్యాయని,వారిని ఇప్పటికి గుర్తించకపోవడం సిగ్గుచేటైన విషయమని ఎద్దేవా చేశారు.తెలంగాణఉద్యమ కళాకారులను, పక్కనపెట్టి సినీ మాఫియా సినిమా ఇండస్ట్రీకి చెందిన హీరోయిన్స్,హీరోలకు పెద్ద మొత్తంలో లక్షల,కోట్ల రూపాయల రాయితీని ప్రభుతం అప్పనంగా పంచి పెడుతుందని మండిపడ్డారు.వాళ్ళు ఎవ్వరు కూడా తెలంగాణ కోసం కొట్లాడినోళ్లు కాదని,జానపద సాహిత్యా రంగానికి మూలమే సంచార జాతుల సాహిత్యం,అలాంటి జానపద రంగంమీద సాహిత్యంమీద ఏర్పడిన ప్రత్యేక తెలంగాణలోసంచార జాతులకు విద్య ఉద్యోగ ఆరోగ్య రంగాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ సాంస్కృతిక సారథిలో కోలాటం, బుర్రకథలు, తోలుబొమ్మలాట, పగటివేషాలు,గంగిరెద్దులాట,గరక నృత్యం,యాక్షగానం, జంగం కథలు,కత్తి సాములు,చెక్కభజన,గొల్ల సుద్దులు,చిందు యాక్షగానం,చిత్రలేఖనంలో మధుబని,గోండు కలంకారి కళారూపాలు కనుమరుగైయ్యాయని ఆవేధన చెందారు.కళాకారులు అంటే కలలను సృష్టించేవారని,సమాజానికి విజ్ఞానాన్ని,వినోదాన్ని అందించేవారని అన్నారు.జానపద శాస్త్రీయ ప్రతిభతో సంస్కృతిని పరిరక్షించి,సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో,సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర తెలంగాణ కళాకారులు పోషించారని కొనియాడారు.తమ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి,సామాజిక సమస్యలపైన చైతన్యవంతం చేస్తారని వివరించారు.చట్టబద్ధతతో కూడిన జీవో వెంటనే అమలు చేయాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు.తెలంగాణ సాంస్కృతిక సారథ్యంలో నిజమైన కళాకారులను గుర్తించి,సుమారు వెయ్యి మందికి ఉద్యోగాలు,ఉచిత విద్య,ఉపాధి సౌకర్యాలు,250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి,నాలుగు గదుల ఇళ్లను కట్టివ్వాలని,వృద్ధాప్యంలో ఉన్న కళాకారులకు నెలకు ముప్పయి వేళా రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ,జరుగుతున్న సూర్యపేట సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బకాయి బిల్లును చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**తొలి వెలుగు, నిజామాబాద్ అర్బన్ :** గురువారం రోజు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిజాంబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓ మయ్య మాట్లాడుతూ గత ఆగస్టు నెల నుండి మధ్యాహ్న భోజన కార్మికులు పిల్లలకు వంట చేసి పెట్టిన బిల్లులు రావాల్సి ఉందని నిజాంబాద్ జిల్లాకు దాదాపు 8 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నరు. బహిరంగ మార్కెట్లో కోడిగుడ్డు ధర ఎనిమిదిన్నర రూపాయలు ఉంటే ప్రభుత్వం ఆరు రూపాయలు ఇవ్వటం సరికాదని కిందిస్థాయిలో హెడ్మాస్టర్లు ఎంఈఓ లు కక్షగట్టి మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కారణాలతో అకారణంగా తొలగిస్తున్నారని అన్నారు. సంక్రాంతి వరకైనా కార్మికులకు రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని లేనియెడల సంక్రాంతి తర్వాత సమ్మెకు వెళతామని జిల్లా కలెక్టర్ కి తెలియజేశారు. పై సమస్యలపై స్పందించిన కలెక్టర్ పై అధికారులతో మాట్లాడే సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి






అధ్యక్షురాలు స్రవంతి నాయకులు సాయమ్మ , నరేష్ నాగలక్ష్మి గంగమణి, సుజాత, గంగాధర్ వివిధ మండలాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన సర్పంచ్ కిషన్

**తొలి వెలుగు, ఇందల్వాయి :** మండలంలోని తిర్మన్ పల్లి అంగన్వాడి పిల్లలకు ఏకరూప దుస్తువుల పంపిణీ గురువారం ఉదయం గ్రామ సర్పంచ్ చింతల కిషన్ చేతులమీదుగా అందజేశారు, ఈ సందర్భంగా తిర్మన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్ మాట్లాడుతూ పిల్లలకు పోషక ఆహారాన్ని శుభ్రమైన మంచినీరు మరియు అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఈ సందర్భంలో ఆదేశించారు, ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రానికి అవసరం ఉన్న ఎటువంటి విషయాన్నైనా తమకు తెలుపాలని అంగన్వాడి కేంద్రానికి తమ పూర్తి సహకారం అందజేస్తామని పంచాయతీ సెక్రెటరీ అంగన్వాడీ టీచర్ ముందు ఆయన తెలియజేసారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రజల సమస్యల మీద ప్రజల ఆరోగ్యాల మీద ప్రజల చదువుల మీద ప్రతిష్టాపకంగా కోట్ల రూపాయల ఖర్చు చేస్తుంది ప్రజల క్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని పథకాన్ని ప్రజలకు అందజేయడానికి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి గారి సహకారంతో సర్పంచ్ గా గెలిచాను నాకు కావాల్సింది పదవి కాదు గ్రామ అభివృద్ధి ప్రజల కు మంచి చేయాలని గ్రామ అభివృద్ధి నా బాధ్యత అని నేను ప్రజల సేవ కొరకు సర్పంచ్ గా పోటీ చేశాను గ్రామంలో ఏ



సమస్యలున్న తమకు తెలిపాలని ఈ సందర్భంగా ఆయన కోరారు, గ్రామ సర్పంచ్ చింతల కిషన్. పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, కరోబార్ నరేందర్. బాలకిషన్. అంగన్వాడీ టీచర్ వనిజ. మరియు వార్డు సభ్యులు పిల్లల కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,